ANDHRAJYOTHI (Karnataka), March 17, 2014, Page No. 08



# నిత్యావసరాల పంపిణీ బాధ్యత ప్రభుత్వానిదే

## రౌండ్‌టేబుల్ సమావేశంలో ప్రముఖుల అభిప్రాయం

**ఆంధ్రజ్యోతి, బెంగళూరు** : రేషన్ కార్డుల ద్వారా నిత్యావసర వస్తువుల పంపిణీ బాధ్యత ప్రభుత్వానిదేనని భారతీయ సామాజిక భద్రతా సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి ఆర్‌కే సుబ్రహ్మణ్యం, కర్ణాటక ప్రభుత్వం మాజీ చీఫ్ సెక్రటరీ భట్టాచార్యలు అభిప్రాయపడ్డారు. కర్ణాటక వాణిజ్య పరిశ్రమల సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం సామాజిక రక్షణ, ఆహార భద్రత అనే అంశాలపై రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సోషియల్ ప్రొటెక్షన్ ఫ్లోర్ అండ్ ఫుడ్ సెక్యూరిటీ అసోసియేషన్ ఇండియా జనరల్ సెక్రటరీ సోమ్‌తో పాటు సీనియర్ ప్రాజెక్టు సలహాదారులు ప్రవీణ్ సిన్హా, సాహు, రమానంద్‌లతో పాటు వివిధ వర్గాలకు చెందిన ప్రముఖులు చర్చాగోష్టిలో పాల్గొన్నారు. భట్టాచార్య మాట్లాడుతూ జర్మనీలో తమ కుటుంబీకులు ఉన్నందున తరచూ వెళుతుంటామని అక్కడి తరహాలో ఆహార భద్రత ఇండియాలో లేదన్నారు. నిరుపేదలకు అందిస్తున్న నిత్యావసరాలలో సుమారు సగం శాతం అక్రమాలకు కారణమవుతోందని ఇటీవల పలు సర్వేలు తేల్చడం విచారణ కలిగిస్తోందన్నారు. ప్రభుత్వం రేషన్ పంపిణీని డీలర్ల ద్వారా కాకుండా నేరుగా పంపిణీ చేయాల్సి ఉందన్నారు. మధ్యవర్తుల జోక్యం తగ్గించాల్సి ఉందన్నారు. అదే రీతిన రూపాయికే కిలో బియ్యం వంటి పథకాలతో అక్రమాలు జరిగేందుకు ఆస్కారాలు ఎక్కువన్నారు. బహిరంగ మార్కెట్‌లో ధరలకు, సబ్సిడీలకు భారీ తేడా ఉన్నందునే ఇబ్బందులకు కారణమన్నారు. ప్రభుత్వాలు ఉపాధి హామీ పేరుతో అమలు చేస్తున్న పథకాలు బాగానే ఉన్నా ప్రజలలో సోమరితనం పెరిగేందుకు కారణం అవుతున్నాయన్నారు. అలా కాకుండా వారిలో బాధ్యత పెంచాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడ్డారు.




రౌండ్‌టేబుల్ చర్చావేదికలో పాల్గొన్న ప్రముఖులు